క్లుప్తంగా

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు

కురవి: మండలంలోని నేరడ మోడల్ స్కూల్/కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ఖాళీ సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఆన్‌లైన్‌లో సీట్ల భర్తీ పూర్తయ్యాక మిగిలిన సీట్లకు ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలోని 6 సీట్లు, బైపీసీలో 10 సీట్లు, సీఈసీలో 15 సీట్లకు, ఎంఈసీలోని మిగిలిన సీట్ల భర్తీ ఈనెల 19వ తేదీలోగా పాఠశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

హెచ్‌బీటీ పోస్టుకు దరఖాస్తులు

నేరడలోని మోడల్ స్కూల్/కళాశాలలో హెచ్‌బీటీ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీకాంత్ తెలిపారు. ఖాళీగా ఉన్న పీజీటీ కామర్స్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు, 19వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

నిధుల మంజూరుపై హర్షం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కేసముద్రం: కేసముద్రం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.100కోట్ల నిధులను మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ, శనివారం మున్సిపాలిటీ పరిధిలోని అమీనాపురం గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భుక్య మురళీనాయక్ చిత్రపటాలకు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు బట్టు శ్రీను, కల్లెం శ్రీనివాస్‌రెడ్డి, లింగాల నేతాజీ, జన్ను కట్టయ్య, వేల్పుగొండ ఏలీయా, నాగేంద్రబాబు, బాలునాయక్, రమాదేవి, యాకయ్య పాల్గొన్నారు.

శ్రీనివాస్ మృతి పార్టీకి తీరనిలోటు



కురవి: విద్యార్థి దశ నుంచి సైద్ధాంతిక నిబద్ధత కలిగిన పార్టీ నాయకుడు పోగుల శ్రీనివాస్‌ను కోల్పోవడం పార్టీకి తీరనిలోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం రాజోలు గ్రామంలో శ్రీనివాస్ ఇంటికి వచ్చిన ఆయన శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, మరిపెడ ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి, నాయకులు కట్టెబోయిన శ్రీనివాస్, కరణం రాజన్న, నెల్లూరి నాగేశ్వర్‌రావు, బుర్ర సమ్మయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పెద్దవంగర: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నవంగర గ్రామానికి చెందిన జలగం మల్లయ్య (50) అదే గ్రామానికి చెందిన వల్లపు అశోక్ (45) తమ పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై గత నెల 31న తొర్రూరు మండలంలోని చెర్లపాలెం గ్రామానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గ్రామ శివారులో రోడ్డుపై పడి ఉన్న విద్యుత్ తీగలు ద్విచక్ర వాహనానికి తగలడంతో తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు తక్షణమే వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. వల్లపు అశోక్ అదే రోజు మృతి చెందగా, జలగం మల్లయ్య(50) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య సాయి మల్లమ్మ, కుమార్తె చిన్ను ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



వైద్యశిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు

మహబూబాబాద్ రూరల్: ప్రతీ ఒక్కరు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని బడాట బంజార ప్రాజియర్ ట్రస్టు వ్యవస్థాపకులు బిషప్ డాక్టర్ భూక్య లాజరస్ లాల్‌సింగ్ అన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని సాదుతండాలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భూక్యా ఆనంద్ ప్రేమ్ సాగర్ సింగ్, సంస్థ కార్యనిర్వాహణ అధికారి భూక్యా సాలొమోను, వైద్యులు కల్యాణి సాగర్, విజయ్ సూర్య, సాగర్ సింగ్, ప్రియవిజయ్ సింగ్ పాల్గొన్నారు.

నాన్నకు ప్రేమతో..

నాన్నంటే ఓ నమ్మకం.. ఓ భరోసా.. ఓ ధైర్యం.. చిన్నప్పుడు చిటికెన వేలు పట్టుకుని నడక నేర్పించి, పిల్లలను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని మదిలోనే మురిసిపోయే వ్యక్తి నాన్న. పిల్లలు గెలిచినప్పుడు పదిమందికి గొప్పగా చెప్పుకునే వ్యక్తి.. ఓడినప్పుడు భుజం తట్టి వెన్నంటి ఉండి గెలుస్తావులే అని గుండెకు హత్తుకుని ధైర్యం చెప్పే వ్యక్తి నాన్న ఒక్కరే. నేడు ఫాదర్స్‌డే సందర్భంగా పలువురిపై సాక్షి ప్రత్యేక కథనం..

కష్టమే సొమ్ముగా..



పిల్లలు కౌశిక్, కొండిన్యతో కుమార్ దంపతులు

పెద్దవంగర: మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన కోటగిరి కుమార్–యాకలక్ష్మీ దంపతులు. కుమార్ ఉన్నత విద్యావంతుడైనప్పటికీ ఉద్యోగం లభించకపోవడంతో తొర్రూరు పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో పని చేస్తూ తమ ఇద్దరు పిల్లలను ఉన్నత చదువులు చదివించాడు. బాబు కౌశిక్ బీటెక్ పూర్తి చేసి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. కుమార్తె కొండిన్య ఎంబీబీఎస్ పూర్తి చేసి వరంగల్ ఎంజీఎంలో హౌస్‌సర్జన్‌గా వైద్యవిద్యను కొనసాగిస్తుంది.

తండ్రి కల నెరవేర్చా..



తల్లిదండ్రులతో డాక్టర్ జ్వలిత

తొర్రూరు: మా నాన్న పేరు బుర్ర అజయ్‌కుమార్. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. మా స్వస్థలం చెన్నారావుపేట. నేను మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారిగా పని చేస్తున్నాను. నన్ను వైద్యురాలిని చేయాలనేది మా నాన్న కోరిక. చిన్నప్పటి నుండే నన్ను ఆ దిశగా ప్రోత్సాహించాడు. ఉద్యోగం సాధించి తొర్రూరు మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాను. నా సోదరి సద్విజ సైతం తండ్రి ఆశయానికి అనుగుణంగా సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నారు.

– బుర్ర జ్వలిత, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు

నాన్న ప్రోత్సాహంతోనే..



చిన్నగూడూరు: మాది మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం. మా అమ్మా నాన్నలు గాడిపెల్లి యాకలక్ష్మి (లేట్), ఉప్పలయ్య. నాన్న వృత్తిరీత్యా కల్లుగీత కార్మికుడు. కల్లు గీసి కుటుంబాన్ని పోషిస్తూ మమ్ముల్ని చదివించేవాడు. ఆయన నేర్పిన క్రమశిక్షణ, నడవడికతోనే నేను కష్టపడి ఇష్టంగా చదివి ప్రస్తుతం మామునూరులో ఆర్ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నాను. ఈ స్థాయిలో ఉండడానికి తండ్రి ప్రోత్సాహమే కారణమని తెలుపుతున్నాడు.

– గాడిపెల్లి సంతోష్ కుమార్(ఆర్ఎస్సై)

కష్టంలో కరిగిపోతూ వెలుగునిచ్చాడు..



దంతాలపల్లి: మాది మండలంలోని పెద్దముప్పారం గ్రామం. మా నాన్న పేరు తోడేటి కొమురయ్య. వ్యవసాయం చేసి మమ్మల్ని చదివించాడు. నేను మా కుటుంబంలో పెద్దవాడిని. మా నాన్న కష్టపడి మమ్మల్ని చదివించాడు. కొత్తగూడెం ప్రభుత్వ పాటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజనీర్ విభాగంలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నా. తమ్ముడు మురళీ ఎంసీఏ చదువుతున్నాడు. మా నాన్న కష్టంలో కరిగిపోతూ మాకు వెలుగునిచ్చాడు.

– తోడేటి అనిల్, దంతాలపల్లి

సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం

● డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్



దంతాలపల్లి: ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్

దంతాలపల్లి: రాష్ట్రంలో పేదల సొంతింటి కల తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్ అన్నారు. మండలంలోని పెద్ద ముప్పారం గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ నిర్వహించి, లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పది సంవత్సరాల పాలన కాలంలో మండలంలో 300 ఇళ్లను మాత్రమే ఇవ్వగా, ప్రజా ప్రభుత్వం ఒక్క మొదటి దశలోనే మండలానికి 370 ఇళ్లు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాము, ఏఎంసీ వైస్ చైర్మన్ బట్టునాయక్, హౌసింగ్ బోర్డు పీడీ రాజయ్య, తహసీల్దారు సునీల్‌కుమార్, ఎంపీడీఓ వివేక్ రామ్, ఎంపీఓ అప్సర్‌పాషా, పంచాయతీ రాజ్ ఏఈ సుగునాకర్ రాయ్, ఎస్సారెస్పీ డీఈ వినయ్ పాల్గొన్నారు.

నర్సింహులపేట: రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల ద్వారా ప్రభుత్వం నిరుపేదలకు ఆశ్రయాన్ని కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ స్పీకర్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. శనివారం మండలంలోని పెద్దనాగారం, గోపతండా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీఓ యాకయ్య, ఏఈ సుగుణాకర్‌రావు, ఆర్ఐ అఖిల్, మండల అధ్యక్షుడు జినుకుల రమేష్, చిర్ర సతీష్ గౌడ్, దాసరోజు రాజశేఖర్ పాల్గొన్నారు.

నిరుపేదల ఆకాంక్ష నేర వేర్చే ప్రభుత్వం

మరిపెడ రూరల్: నిరుపేదల ఆకాంక్షను నేరవేర్చేటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్ అన్నారు. మరిపెడ మండలం వెంకట్‌తండా, లక్ష్మీతండా గ్రామ పంచాయతీలో లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గుగులోతు రవినాయక్, కాలం రవీందర్‌రెడ్డి, బానోతు అనిల్, అమృనాయక్, కర్ణ, యాకన్న పాల్గొన్నారు.

మోదీ అభివృద్ధిని ప్రచారం చేయాలి



డోర్నకల్: మాట్లాడుతున్న మోతీలాల్‌నాయక్

డోర్నకల్: ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో 11ఏళ్లలో జరిగిన అభివృద్ధిని బీజేపీ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ నియోజకవర్గ ప్రభారి వాంకుడోత్ మోతీలాల్ తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో శనివారం డోర్నకల్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రచారపోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు బానోత్ గణేష్‌నాయక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాయల రాంబాబు, లక్ష్మినారాయణ, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు రెహమాన్, నాయకులు నాగేశ్వర్‌రావు, హన్మంతు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి బీజేపీ కృషి

కురవి: దేశాభివృద్ధికి బీజేపీ కృషి చేస్తుందని, పీఎం నరేంద్రమోదీ దేశాన్ని ప్రపంచంలో మేటిగా నిలబెడుతున్నాడని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్యామ్ సుందర్ శర్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మోదీ ప్రధానమంత్రిగా 11 ఏళ్ల పాలనలో దేశాన్ని విశ్వగురువుగా చేసిన సందర్భంగా కార్యకర్తలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూక్య కిషన్ నాయక్, నాయకులు కొణతం పెంటయ్య, శ్రీరామోజు నాగరాజు, కోడి రామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం కురవి ఎస్సైని సన్మానించారు.

శాంతిచర్చలు జరపాలి



మాట్లాడుతున్న పద్మ

బయ్యారం: మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతిచర్చలు జరపాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఊకే పద్మ డిమాండ్ చేశారు. మండలంలోని వెంకట్రాంపురంలో బొల్లం సోమక్క అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక ఆదివాసీలను కాల్చి చంపటం దుర్మార్గమన్నారు. ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ చేయాలని, మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని కోరుతూ ఈనెల 17న హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు లక్ష్మి, సమ్మక్క, అనసూర్య, విజయ, గౌతమి, సుభద్ర పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి



నెహ్రూసెంటర్: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్/బయ్యారం: ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బిళ్లకంటి సూర్యం పిలుపునిచ్చారు. జూన్ 21, 22 తేదీలలో నిజామాబాద్‌లో జరగనున్న మహాసభల పోస్టర్లను శనివారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోతుందని మండిపడ్డారు. సంఘటిత, అసంఘటిత కార్మికులకు న్యాయం చేసేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రాష్ట్ర మహాసభలకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అరవపల్లి వెంకన్న, కమ్మగాని సంపత్, కిరణ్, బ్రహ్మచారి, మల్లేషం, సిరి, నగేష్, హరి, మహేష్, అంజి, పవన్, తదితరులు పాల్గొన్నారు.

చే గువేరా స్ఫూర్తితో ఉద్యమించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

నెహ్రూసెంటర్: చే గువేరా స్ఫూర్తితో ప్రజాసమస్యలపై ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాలనీకి చే గువేరా కాలనీగా నామకరణం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సామ్రాజ్యవాదానికి, కుల, మత రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతులు సాగు చేసుకుంటున్న భూములకు భూ భారతి ద్వారా పట్టాలు ఇవ్వాలన్నారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావో హత్యకాండను ఆపాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య, నాయకులు సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్, కుమ్మరికుంట్ల నాగన్న పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి నిరంతర కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

పెద్దవంగర: గిరిజన గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు నిరంతరం కృషి చేస్తానని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మోత్యాతండా, శంకర్ తండా, బొత్తలతండాలతోపాటు పలు తండాల్లో పల్లెబాట కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆమె పాల్గొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తండావాసులు తమ సమస్యలను విన్నవించారు. ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి చొరవతో తండాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, జాటోతు నెహ్రూ నాయక్, నెమరుగొమ్ముల ప్రవీణ్ రావు, రంగు మురళీ, దుంపల శ్యాం, జాటోతు సీతారాం నాయక్, తోటకూర శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల హక్కుల కోసం పోరాడాలి



మాట్లాడుతున్న కుంట ఉపేందర్

నెహ్రూసెంటర్: అంగన్‌వాడీ హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో అంగన్‌వాడీ యూనియన్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను హరించేలా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హక్కులు, చట్టాల అమలుకై జులై 9న జరగనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏసుమళ్ల సంపూర్ణ, జిల్లా కార్యదర్శి స్నేహబిందు, మల్లికాంబ, స్వరూప, శైలజ, అనురాధ పాల్గొన్నారు.

మహాసభల కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

చిన్నగూడూరు: రాష్ట్ర ప్రభుత్వం గొల్ల కురుమలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని జీఎంపీఎస్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పయ్యావుల మల్లయ్య, బొల్లం అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో సంఘం బాధ్యులు బొల్లు వెంకన్న, జక్కుల ఉప్పలయ్య అధ్యక్షతన మండల సదస్సు నిర్వహించారు. సంఘం జిల్లా మూడ మహాసభల కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 22న జిల్లా కేంద్రంలో జరిగే సభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సూరబోయిన భిక్షపతి, కార్యదర్శిగా కొమ్ము రమేష్, ఉపాధ్యక్షులుగా నూకల ఐలయ్య, బొమ్మ లింగమూర్తి, బొల్లు వీరన్న, సహాయ కార్యదర్శులుగా లొడంగి శ్రీను, ఉడుత ఉపేందర్, కొంపల్లి నాగరాజు, కోశాధికారిగా బొల్లు లింగరాజు, సోషల్ మీడియా కన్వీనర్‌గా పచ్చిపాల ఉమేష్, గౌరవ అధ్యక్షుడిగా ఆవుల భిక్షపతి, గౌరవ సలహాదారుడిగా కొమ్ము మల్లయ్య, నూకల గంగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సోమన్న, మల్లయ్య, వెంకన్న, శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి యువతి మృతి

డోర్నకల్: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలోని తొడేళ్లగూడెం సమీపంలోని వ్యవసాయ బావిలో పడి ఓ యువతి మృతిచెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మాచర్ల ప్రాంతానికి చెందిన జి.సురేఖ(20) రోడ్డు నిర్మాణ పనుల కోసం వచ్చి తొడేళ్లగూడెం సమీపంలో ఏర్పాటు చేసిన శిబిరంలో నివాసం ఉంటుంది. శనివారం మధ్యాహ్నం భోజనం చేసి మల విసర్జనకు వెళ్తున్నానని తోటి కూలీలకు చెప్పి బయటకు వెళ్లింది. సురేఖ తిరిగి రాకపోవడంతో కూలీలు వెతుకుతుండగా సమీపంలోని వ్యవసాయ బావిలో సురేఖ మృతిచెంది కన్పించింది. కూలీలు, రైతుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. సురేఖ కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత కేసు విచారిస్తామని పోలీసులు తెలిపారు. కాగా, సురేఖ మృతికి గల కారణాలు తెలియరాలేదు.

సంక్షిప్త సమాచారం

19న స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికలు

గూడూరు: 2025– 26 సంవత్సరానికి గాను 4వ తరగతిలో స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఈనెల 19వ తేదీన గూడూరు బాలుర హైస్కూల్‌లో సెలక్షన్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2016 మే 1వ తేదీ నుంచి 2017 అగస్టు 31 తేదీల మధ్య జన్మించిన వారు అర్హులని, సర్టిఫికెట్లతో ఆదివారం సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్ చేసుకోవాలని, ఎంపిక రోజు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

రేపు మధుయాష్కిగౌడ్ రాక

మహబూబాబాద్ రూరల్: టీపీసీసీ క్యాంపెనింగ్ కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ ఈనెల 16 సోమవారం ఉదయం 7గంటలకు మహబూబాబాద్ జిల్లాకు వస్తున్నట్లు టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ మేకల వీరన్న యాదవ్ శనివారం తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని స్వాగతం పలకాలని కోరారు.

అధికారుల నిర్లక్ష్యం

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని అమీనాపురం ఎస్సీ కాలనీలో గల వాటర్ ట్యాంక్‌కు సంబంధించిన విద్యుత్ మోటార్‌ను రిపేర్ చేయించడంతో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సీపీఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ ఆరోపించారు. శనివారం అమీనాపురం ఎస్సీ కాలనీలోని వాటర్‌ట్యాంక్ వద్ద కాలనీవాసులు ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో శరత్, శ్రీను, సుహాసిని, సరిత, విజయ, ప్రియాంక పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

గూడూరు: ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యాన్ని, అవయవాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ రాజేందర్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో శనివారం కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు వాంకుడోతు నవీన్‌నాయక్ ఆధ్వర్యంలో మానుకోటకు చెందిన సూర్య స్వచ్ఛంద సేవా ట్రస్టు (సూర్య కంటి ఆసుపత్రి) సహకారంతో ఉచిత కంటి శుక్ల పరీక్ష శిబిరం నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కురవి: మండలంలోని అయ్యగారిపల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈనెల 15న(నేడు ఆదివారం) ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శారద శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కురవి, తిర్మలాపురం, అయ్యగారిపల్లి, చింతపల్లి, మాధవపురం, నల్లెల్ల, మోద్గులగూడెం గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆమె సూచించారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన



కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రం విలేజ్, ఎన్టీఆర్‌నగర్‌లో పలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శనివారం శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ అభినయ్, మున్సిపల్ అధికారి ప్రభాకర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కత్తెరశాల శ్రీనివాస్, మాసాడి శ్రీనివాస్, కీర్తి సురేందర్, చిట్ల సంపత్, రమేశ్ పాల్గొన్నారు.

వనభోజనాలు

మహబూబాబాద్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామంలో ఊరంతా వన భోజనాలకు తరలివెళ్లగా శనివారం సందడి వాతావరణం నెలకొంది. వేట వేంకటేశ్వరునిగా ప్రసిద్ధి చెందిన స్వామివారికి భక్తులు మొక్కులు చెల్లించుకుని తమ భక్తిప్రపత్తులు చాటుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శంతన్ రామరాజు, ధార ఇందుభారతి, మహ్మద్ సుభాని, చిట్టిబాబు, ఉదయ్ ధీర్, సాగర్ రామరాజు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

నెల్లికుదురు: తెగిపోయిన చెరువు కట్టలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈమేరకు సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో చెరువు కట్టలకు మరమ్మతులు చేపట్టాలని ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బాబు గౌడ్, యాకన్న, నర్సయ్య, పుల్లయ్య, భిక్షపతి, రైతులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి

డోర్నకల్: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఉచితంగా విద్యుత్, నల్లా కనెక్షన్ ఇవ్వాలని అంబేద్కర్ సేవా సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు ఏపూరి రమణ కోరారు. శనివారం ఆయన మాట్లాడారు.

డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన నాయకులు

మరిపెడరూరల్: రాష్ట్ర శాసన సభ ఉపసభాపతిగా నియమితులైన ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌ను సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, ఆత్మ మరిపెడ డివిజన్ చైర్మన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి మరిపెడలో మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మారగాని బాలకృష్ణ, అబ్దుల్ రషీద్, కరణం రాజన్న ఉన్నారు.

ఆలయంలో పూజలు

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని అమీనాపురంలో గల శ్రీభూనీలా సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, వోలం మురళీ, కృష్ణమూర్తి, పరమేశ్వర్ పాల్గొన్నారు.

అర్హులకే 'రాజీవ్ యువ వికాసం' ఇవ్వాలి

చిన్నగూడూరు: అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే బ్యాంకులతో సంబంధం లేకుండా రాజీవ్ యువ వికాసం పథకం వర్తింపజేయాలని అంబేద్కర్ యువజన సంఘం జయ్యారం కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. శనివారం మండలంలోని జయ్యారం గ్రామంలో ఎస్సీ కాలనీ సంఘం ప్రధాన కార్యదర్శి మిడతపల్లి అరవింద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎలాంటి నిబంధనలు లేకుండా అర్హులైన నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాసం అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం కమిటీ సభ్యులు ఆకారపు రాము, జాగటి ఉపేందర్, బర్పటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను నిర్మూలించాలి

మహబూబాబాద్ రూరల్: మూఢనమ్మకాల నిర్మూలనలో ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని రూరల్ సీఐ సర్వయ్య అన్నారు. మండలంలోని రెడ్యాల గ్రామంలో కళాబృందం సభ్యులు శుక్రవారం రాత్రి కళాజాతా నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై దీపిక, రెండవ ఎస్సై సూరయ్య, ఏఎస్సై రమేష్, కానిస్టేబుళ్లు వెంకన్న, సురేష్ పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల ప్రారంభం



ప్రారంభిస్తున్న మేనేజర్ కృష్ణయ్య

గార్ల: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆర్థిక సహాయంతో గార్లలోని బంజారా సేవా సమితి హైస్కూల్లో నిర్మించిన అదనపు తరగతి గదులను ఇల్లెందు ఏరియా సింగరేణి కాలరీస్ మేనేజర్ కృష్ణయ్య శనివారం ప్రారంభించారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఆర్థికసాయం అందించిన సింగరేణి కాలరీస్ కంపెనీ యాజమాన్యంకు బంజారా సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు తేజావత్ జోగ్రాం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ రవికుమార్, అధికారులు అజ్మీర తుకారాం, వెంకటేష్, లింగసాయి, బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తేజావత్ జోగ్రాం, మేనేజర్ సేన, అకాడమిక్ డైరెక్టర్ కిరణ్ సత్యమూర్తి, అశోక్, సమత, భవ్య, మంజుల, యాస్మిన్ పాల్గొన్నారు.

చేదబావిలో జారిపడిన చిన్నారులు

గూడూరు: ఓ చిన్నారి ఎత్తుకొని వెళ్లిన బాలిక చేదబావిపై ఉన్న మూతపై నిలబడగా, ప్రమాదవశాత్తు జారి బావిలో ఇద్దరు పడిన సంఘటన మండలంలోని మచ్చర్ల గ్రామంలో శనివారం జరిగింది. వివరాల ప్రకారం వేసవి సెలవుల కోసం మచ్చర్లలోని అమ్మమ్మ ఒంగోటి రాజు ఇంటికి పాల్వంచకు చెందిన హర్షిత అనే బాలిక వచ్చింది. మధ్యాహ్నం ఎదురింటి కొట్టెం సూర్యకుమార్, నవ్య దంపతుల సంవత్సరంన్నర బాలుడు కౌషిక్‌ను ఎత్తుకొని వెళ్లి, అమ్మమ్మ ఇంటి వద్ద గల చేదబావి పై కప్పు మూతపై నిలబడింది. ప్రమాదవశాత్తు కప్పుజారడంతో ఇద్దరు చిన్నారులు బావిలో పడ్డారు. అది గుర్తించిన వారు అరుస్తూ వచ్చి బావిలో పడిన చిన్నారులను పైకి తీశారు. వెంటనే ఇద్దరిని గూడూరు సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. బాలిక హర్షితకు ప్రమాదం ఏమీ లేదని వైద్యులు తెలిపారు. ప్రథమ చికిత్స అనంతరం చిన్నారి బాలుడు కౌషిక్‌ను మానుకోటలోని పిల్లల అసుపత్రికి చికిత్స కోసం తరలించారు. బాబుకు ప్రమాదం తప్పిందని, బాగానే ఉన్నట్లు తెలిపారు.